
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 29 ఏప్రిల్ 2025 పేజీలు 8



# వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత

- బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేసే అలవాటు వదిలివేయాలి
- నాలుగు థీమ్‌లుగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నాం
- స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించే విధానంపై త్వరలో రూట్ మ్యాప్
- సీఎం ఆదేశాలతో రాష్ట్రంలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ




**విజయవాడ బ్యూరో, ఏప్రిల్ 28, మేజర్ న్యూస్ :** వేస్ట్ మేనేజ్ మెంట్ కు పంచాయితీ, పురపాలక సంఘాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్, బిహేవియరల్ చేంజ్ పై సోమవారం ఒక రోజు వర్క్ షాప్ విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్ షాప్‌నకు హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతిరోజూ 6500 టన్నుల సాలిడ్ వేస్ట్ వస్తుందన్నారు. గత ప్రభుత్వం 80లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందని, సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ ఏడాది అక్టోబర్ 2 లోపు చెత్తనంతా తొలగించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్,లిక్విడ్ వేస్ట్ తొలగించడం ఎంతో సవాల్‌తో కూడుకున్నదని, అయితే ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు చెత్తను తొలగిం చడానికి తీసుకుంటున్న ఉత్తమ నిర్ణయాలను క్రోడీకరించి మన రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. ఏరోజుకా రోజు ఈ చెత్తనంతా తొలగించాలన్న దృక్పదంతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. నాలుగు థీమ్‌లుగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని, వాటిని క్రమబద్ధంగా అమలు చేసి దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలను ఏ మేరకు సమర్థవంతంగా మిగతా 2లో

## అవరోధాలను అధిగమించి..
# ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి
- సమాజంలో అందరితో సమానంగా ఎదగాలి
- 173 మందికి రూ. 18.70 లక్షల విలువైన ఉపకరణాల పంపిణీ
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 28, మేజర్ న్యూస్ : ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు అవరోధాలను అధిగమించి.. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. సోమవారం పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శాసనసభ్యులు బోండా మహేశ్వరరావు, అధికారులు, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని ఉపకరణాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన 173 మంది లబ్ధిదారులకు రూ. 18.70 లక్షల విలువైన 273 పరికరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, బ్రెయిలీ కిట్లు, క్రచ్ ఎల్బోలు, టీఎల్ఎం కిట్లు, వీల్ ఛెయిర్లు, వాకింగ్ స్టిక్‌లు, రోలటార్లు వంటివి మిగతా 2లో



## దేశంలోనే అత్యుత్తమ పాలసీగా
# ఏపీ డిఫెన్స్ & ఏరో స్పేస్ పాలసీ

- మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ సెమినార్‌లో ఎంపీ కేశినేని చిన్ని
- సలహాలు సూచనలు అందించిన పారిశ్రామికవేత్తలు
- ఇండస్ట్రీయలిస్టులకు కావాల్సిన విధంగా పాలసీరూపకల్పన

2

## గేట్ వే ఆఫ్ అమరావతిగా..
# బందరు పోర్ట్

- పోర్టు పనులను సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో పరిశీలిస్తున్నారు
- బందరు పోర్టును పరిశీలించిన మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దనరెడ్డి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : బందరు పోర్టును సోమవారం మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి, 2

(మొదటిపేజీ తరువాయి)



## గేట్ వే ఆఫ్ అమరావతిగా.. బందరు పోర్ట్

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి పోర్టును పరిశీలించారు. పోర్టు అధికారులను అడిగి నిర్మాణ స్థితిని గురించి తెలుసుకున్నారు. పోర్టు నిర్మాణ స్థితిగతుల్ని ప్రజలకు తెలియజేయడంతో పాటుగా, వేగవంతం చేయడం కోసం నిత్యం పరిశీలించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పోర్టు పనులపై చిత్తశుద్ధితో పరిశీలిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 4 బెర్తుల పనులు, రోడ్డు పనులు, విజయవాడకు అనుసంధానించే పనులు 43% పూర్తయ్యాయి. గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరు పోర్టు మారేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇన్లాండ్ వాటర్ వేస్ అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి నిర్మాణంలో కూడా పోర్టు భాగస్వామిగా మారబోతోంది. పోర్టు పనులు త్వరగా పూర్తి చేయడం ద్వారా పోర్ట్ బేస్డ్ ఇండస్ట్రీలు కూడా ఎక్కువగా మచిలీపట్నంలో ఏర్పడేందుకు అవకాశాలు ఉంటాయి. మరోవైపు బందరులో టూరిజం హబ్ ఏర్పాటు పనులు చేస్తున్నాం సర్క్యూట్ టూరిజం అభివృద్ధి చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రులు కొల్లు రవీంద్ర, బిసి జనార్ధనరెడ్డి అన్నారు.

### అవరోధాలను అధిగమించి..

### ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



అందజేయడం జరిగిందన్నారు. ఈ ఉపకరణాలు ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని.. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపుతోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని కెరీర్ పరంగా ఉన్నత అవకాశాలను చేజిక్కించుకోవాలన్నారు. రానున్న రోజుల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం**

**శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు**

రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటోందని, ప్రభుత్వ సదుపాయాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. భవిష్యత్తులోనూ విభిన్న ప్రతిభావంతులకు ఇదేవిధమైన సహాయం అందుతుందని, సదరం సర్టిఫికెట్లతో కొత్త పెన్షన్లు కూడా అందించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ అందుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమగ్రాభివృద్దిలో ఎన్‌జీవోలు కూడా భాగస్వాములవుతున్నాయన్నారు. విభిన్న ప్రతిభావంతులు బాగా చదువుకునేందుకు తోడ్పడే ఉపకరణాలు అందించడం జరుగుతోందని.. ఎన్ని కావాలన్నా ఇలాంటి ఉపకరణాలు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, సమగ్ర శిక్ష అధికారి ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత



(మొదటిపేజీ తరువాయి)

అమలు చేశామన్నది అన్నింటికన్నా ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండ అవగాహన కలిగిఉండాలన్నారు. అలాగే చెత్త పట్ల ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించడం, రీసైక్లింగ్ పై చైతన్యం కలిగించే అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టనున్నామని తెలిపారు. వాటిల్లో భాగంగానే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నారని, దీంతో ప్రజల్లో చెత్త నిర్వహణపై అవగాహన పెరిగిందన్నారు. ప్రజలకు అవగాహన ఎలా కల్పించాలి? ఎలాంటి ప్రచారం నిర్వహించాలి అనే దానిపై రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛత యొక్క ప్రాధాన్యత తెలిసేలా రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడి పట్టాభి మాట్లాడుతూ వేస్ట్ మేనేజ్ మెంట్‌లో మన రాష్ట్రం అగ్రగామిగా నిలవాలంటే రాష్ట్రం లో ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఇక్కడకి వచ్చిన స్టేక్ హోల్డర్స్ అంతా ఎంతో అనుభవజ్ఞులని వారి సలహాలు, సూచనలు స్వీకరించి స్వచ్ఛత విషయంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ప్రణాళికలు రూపొందిస్తామని పట్టాభి రామ్ అన్నారు. అలాగే గత నెల యూరోప్ పర్యటన సందర్భంగా 8 కంట్రీస్‌లో ముఖ్యంగా గమనించింది, వారి జీవన శైలిలో స్వచ్ఛతపై ప్రజల్లో ఉన్న అవగాహన అమోఘమన్నారు. అక్కడి ప్రజలు సైతం ప్లాస్టిక్ బిన్ లో ప్లాస్టిక్, పేపర్ బిన్ లో పేపర్ ఇలా వాటికి కేటాయించి బిన్లలో వాటినే వేస్తున్నారని తెలిపారు. అలాగే మన రాష్ట్రంలో కూడా రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా ఎవరికి వారు స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. మనం తీసుకునే ప్రక్రియ ఏదైనా టార్గెటెడ్‌గా ఉంటే ఫలితాలు కూడా త్వరగా వస్తాయని అందులో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు వారికి తగిన కంటెంట్ ప్రణాళిక బద్దంగా తయారు చేసి ఇస్తే ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉందని తెలిపారు. మహిళలకు మరింత చేయుతనిస్తూ వారికి అవగాహన కల్పిస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలమన్నారు. విదేశాల్లో పిల్లలకి చిన్నప్పటి నుంచే ఎడ్యుకేషన్ లో స్వచ్ఛత పైన పాఠ్యాంశాలు ఉన్నాయని అలాగే రాష్ట్రం లో కూడా మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ అలాగే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కూడా చిన్నారుల పాఠ్య పుస్తకాలలో స్వచ్ఛత గురించి పొందు పరచినట్లయితే విద్యార్థులకు చిన్నతనం నుండే స్వచ్ఛతపై బాధ్యత పెరుగుతుందని పట్టాభి రామ్ అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ విదేశాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. మన దేశంలో కూడా శాశ్వతంగా స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వడంలో ప్రజలు తమ కల్చర్ లో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో మన రాష్ట్రం గతేడాది 6 స్థానం లో ఉందని, ఈ ఏడాది మన రాష్ట్రం ర్యాంక్ మరింత మెరుగుపరుచుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్‌ను డ్రైయిన్లలో వేయరాదని, అలా చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయన్నారు.

అనంతరం మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, మున్సిపల్, పట్టణాభివృద్ధి డైరక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి. అనిల్ కుమార్ లు ఐఈసీ పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్జీవో సంస్థలు, స్టేక్ హోల్డర్స్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్, పంచాయితీ, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

# దేశంలోనే అత్యుత్తమ పాలసీగా ఏపీ డిఫెన్స్ & ఏరో స్పేస్ పాలసీ





**మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ సెమినార్‌లో ఎంపీ కేశినేని చిన్ని**

**ఈ సదస్సులో పాల్గొన్న డిఫెన్స్ పి.ఎస్.యు అధికారులు**

**పాలసీ రూపకల్పన కోసం అధ్యాయనం**

**సలహాలు సూచనలు అందించిన పారిశ్రామికవేత్తలు**

**దేశంలోనే అత్యుత్తమ పాలసీ రాష్ట్రంలో తీసుకువచ్చేందుకు కృషి**

**ఇండస్ట్రీయలిస్టులకు కావాల్సిన విధంగా పాలసీరూపకల్పన**

**విజయవాడ బ్యూరో, ఏప్రిల్ 28, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పాలసీ దేశంలోనే అత్యుత్తమ పాలసీగా వుండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరిక, ఆ విధంగా పాలసీ రూపకల్పనే చేసేందుక అధ్యయనం చేస్తున్నామని, ఢిపెన్స్ అండ్ ఏరోస్పెస్ పరిశ్రమలు ఎపికి తీసుకువచ్చి రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు ఢిపెన్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్‌ల రూపకల్పన కోసం సోమవారం హోటల్ వివాంత సెమినార్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్ ఏపీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహదారుడు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి, ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా ఇస్రో మాజీ చైర్మన్ ఎస్పీ సోమనాథ్, ఐ అండ్ సి అండ్ ఎఫ్.పి సెక్రటరీ ఎన్.యువరాజ్ ఐ.ఎ.ఎస్ అధికారి, ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎమ్. అభిషిక్త్ కిషోర్ ఐ.ఎ.ఎస్ అధికారి, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా పాల్గొని ప్రసంగించారు. ముందుగా వీరంతా కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఢిపెన్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ పారిశ్రామిక రంగంలో దేశంలోనే అగ్రగామి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందులో భాగంగానే ఎపిలో ఏర్పాటు కాబోయే డిపెన్స్ పరిశ్రమలు దేశంలోనే ముందు వుండే విధంగా డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్ రూపకల్పన అత్యుత్తమ పాలసీ తీసుకురాబోతున్నట్లు తెలిపారు. మనకు వున్న సముద్ర తీరం బాగా ఉపయోగపడుతుంది. ఎపిలో వున్న సముద్రతీర ప్రాంతాలు బాగా ఉపయోగడపతాయన్నారు. రాష్ట్రంలోని సహజ వనరులతో పాటు రోడ్డు,రైలు, విమాన మార్గాలతోపాటు జలరవాణాకు అనుకూలంగా వుంటుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం లో వికసిత్ భారత్ లక్ష్యం గా దేశంలో నే వంద శాతం రక్షణ రంగ ఉత్పత్తులు తయారికీ ప్రణాళిక సిద్దం చేశారన్నారు. ప్రస్తుతం దేశంలో 61 శాతం మాత్రమే డిఫెన్స్ అండ్ ఏరో స్పెస్ ఉత్పత్తుల తయారీ అవుతున్నాయి. మిగిలిన 40 శాతం పరిశ్రమలను వృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047లో భాగంగా డిపెన్స్ పరిశ్రములు ఏరో స్పెస్ క్లస్టర్లు అభివృద్ధి కంకణం కట్టుకున్నారని తెలిపారు. రాష్ట్రం భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పాటు శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు.

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పారిశ్రామిక జోన్లు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయడానికి విధివిధానాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి సలహాదారులు గా ఉన్న డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్ ఏపీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహదారుడు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి, ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుగా ఇస్రో మాజీ చైర్మన్ ఎస్పీ సోమనాథ్ ల అనుభవం రాష్ట్రంలో డిఫెన్స్ అండ్ ఏరోస్పెస్ పరిశ్రమల అభివృద్ధికి చాలా ఉపయోగపడుతుందన్నారు. రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్ డిఫెన్స్ పరిశ్రమలకు హబ్ గా తయారు కానుందని స్పష్టం చేశారు. ఈ సెమినార్ కి దేశం మొత్తం 17 డిఫెన్స్ పి.ఎస్.యులు వుంటే 7 డిఫెన్స్ పి.ఎస్.యులు వారు హాజరు కాగా, మిగిలిన వారు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వీరితో పాటు ఈ సెమినార్ లో గోవా షిప్ యార్డ్ హిందూస్థాన్ షిప్ యార్డ్ , హెచ్.ఎ.ఎల్ రక్షణ రంగానికి సంబంధించిన ప్రతినిధులు హైదరాబాద్ లో వున్న డిపెన్స్ కి పనిచేసి ప్రైవేట్ ఆర్గనైజేషన్స్, విజయవాడ, వైజాగ్ నుంచి ఇండస్ట్రీయలిస్టులు పాల్గొన్నారు. వీరంతా సెమినార్‌లో పాల్గొని పాలసీ తయారు విషయంలో సలహాలు సూచనలు అందించారు.

# అర్జీల పరిష్కారంలో స్పష్టతకు ప్రాధాన్యతనివ్వండి..






## పునరావృతం కాకుండా అర్జీలకు పరిష్కారం చూపండి..

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఏప్రిల్ 28, మేజర్ న్యూస్ :** స్పష్టమైన సమాచారంతో పునరావృతం కాకుండా అర్జీదారుడు సంతృప్తి చేందేలా అర్జీలను పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన ఆర్జీలకు సంబంధించి క్రింది స్థాయి అధికారులు సిబ్బంది నుండి స్పష్టమైన సమాచారం తీసుకుని అర్జీలు పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించి అర్జిదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పని చేసి ప్రభుత్వ లక్ష్యం నేరవేర్చాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం పై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారన్నారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు ఎండ వేడిమిని సైతం లెక్కచేయక సుదీర ప్రాంతాల నుండి తరలి వచ్చి సమస్యలపై ఆర్జీలను సమర్పిస్తున్నారన్నారు. వారి ఆశలను నేరవేర్చి సమస్యలకు పరిష్కారం చూపడంలో జవాబుదారితనంతో అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 29, పోలీస్ శాఖకు 21, పురపాలక పట్టణాభివృద్ధి శాఖకు 8, పంచాయతీరాజ్ 7, సర్వే 6, డిఆర్‌డిఏ 6, వైద్య 6, జలవనరులు 5, విద్య 4, స్కిల్ డవలంప్‌మెంట్ 4, కోఆపరేటివ్ 3, మెయిన్స్ 3, ఉపాధి కల్పన 2, విద్యుత్ 2, విభిన్న ప్రతిభావంతులు 2, వ్యవసాయం 2, ఆర్‌డబ్ల్యుఎస్, బిసి వెల్ఫేర్, పౌరసరఫరాలు, మార్కెటింగ్, రిజిస్టేషన్, రైల్వే, లీగల్ సర్వీస్, సమగ్ర శిక్ష, అటవీ, రవాణ, ట్రైబల్ వెల్ఫేర్, బ్యాంకుకు సంబంధించిన ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 122 అర్జీలను స్వీకరించడం జరిగిందని ఇందులో 32 అర్జీలను స్వయంగాను 90 అర్జీలను అన్‌లైన్ ద్వారా



స్వకరించిన్నట్లు కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వి నాంచారరావు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## ఉగ్రవాదులు దాడిని ఖండిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

**జగ్గయ్యపేట ఏప్రిల్ 28 మేజర్ న్యూస్ :** జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గం దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పార్టీ కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులకు కోట కృష్ణ మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్లో ఉగ్రవాదులు కాల్పులు జరిపి పర్యాటకులను చంపడాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాదాన్ని అణచవేయాలని దేశంలో లౌకికవాదాన్ని కాపాడాలన్నారు. పర్యాటకులే లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు దాడి చేయడం మతోన్మాద చర్య అన్నారు. హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించడానికి ఉగ్రవాదులు దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఉగ్రవాదులకు కులం, మతం, ప్రాంతం అనేది ఉండదని అన్నారు. ఈ దాడిలో 28 మంది పర్యాటకులు మరణించడాన్ని తీవ్రంగా ఖండించారు. పర్యాటకులపై జరిగిన దాడిని అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, కోట రవికుమార్, రావిళ్ళ శేషు వివి రాంప్రసాద్ భాస్కర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కూచిపూడి సుధాకర్ మోరే కిషోర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## పులిగడ్డ సర్పంచ్ డాక్టర్ విజయ్ కుమార్‌ను సన్మానించిన ఫైర్ అధికారి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ సర్పంచ్ డాక్టర్ దాసరి విజయకుమార్ ను ఫైర్ స్టేషన్ అధికారి వి ఎస్‌వివి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. స్థానిక ఫైర్ స్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్‌ను పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. చిన్న వయసులోనే గౌరవ డాక్టరేట్ లభించడం సామాన్యమైన విషయం కాదని సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సేవా కార్యక్రమాలు చేస్తూ, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో, అభాగ్యులకు అండగా నేనున్నాను అంటూ ఎన్నో సేవలు అందించారని అన్నారు. విజయ్ కుమార్ సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో "78" ఫిర్యాదులు





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి 13.00 గంటల వరకు ఎన్. టి. ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ నేపధ్యంలో సోమవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 78 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలకు, ఆస్తి వివాధాలకు, నగదు లావాదేవీలకు సంబంధించినవి 49, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 03, మహిళా సంబంధిత నేరలకు సంబంధించి 04, దొంగతనాలకు సంబంధించినవి 05, కొట్లాటకు సంబంధించినవి 08, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 09, మొత్తం 78 ఫిర్యాదులును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

# ప్రతి సమస్యకు శాశ్వతమైన పరిష్కారం అందించాలి




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు.

ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 17 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, ఇంజనీరింగ్ 3, రెవెన్యూ సంబంధించినవి 2, వైద్య & ఆరోగ్యం 2, ఉద్యానవనం 1, ఎస్టేట్ 1, పిఒ యుసిడి సంబంధించినవి 3, హౌసింగ్ సంబందించినవి 1 మొత్తం కలిపి 17 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్. డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని సభకి స్వచ్ఛద్ధంగా రావటానికి ప్రజలు సిద్దంగా వున్నారు





**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని**

**టీడీపీ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం**

**ఈ సమావేశంలో స్పెషల్ అబ్జర్వర్ గా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు**

**పీఎం మోదీ సభను విజయవంతం చేయాలని తీర్మానం**

**వెస్ట్ నుంచి 60 వేల మంది వెళ్లేందుకు ఏర్పాట్లు**

**విజయవాడ ఏప్రిల్ 28 మేజర్ న్యూస్ :** అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకి శంకస్థాపన చేయటానికి ప్రధానమంత్రి మోదీ విచ్చేయచున్న సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావటానికి సిద్దంగా వున్నారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. తెలుగు దేశం పార్టీ పశ్చిమనియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం భవానీపురంలోని సంస్కృతి పంక్షన్ హాల్ జరిగింది. ఈ సభకు జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ రాజు సభాధ్యక్షత వహించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పశ్చిమనియోజకవర్గ అబ్జర్వర్ చిట్టాబత్తుని శ్రీనివాసరావు అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకి రానున్న ప్రధాన మంత్రి మోదీకి భారీ స్వాగతం, అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తీర్మానం ప్రవేశపెట్టాగా సభ ఆమోదం తెలిపింది. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ పీఎం మోదీ రాష్ట్రానికి అందిస్తున్న సహకారంకి కృతజ్ఞతులు తెలిపేందుకు ప్రజలు స్వచ్ఛదంగా తరలిరానున్నారని, అందు కోసం పశ్చిమనియోజకవర్గంలో 60 వేలమంది కి పైగా వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అమరావతి రాజధాని నిర్మాణం త్వరగా పూర్తి కావాలన్న తమ ఆకాంక్షను తెలియజేయటానికి ప్రజలందరూ భారీగా హాజరు అయ్యేందుకు సిద్దమైయ్యారని తెలిపారు. అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి డబుల్ ఇంజన్ సర్కార్ గాఅధికారంలో వచ్చిన తర్వాత ప్రధాన మంత్రి రాష్ట్రాన్ని పునర్మించేందుకు ఎన్నో రకాలుగా సహకారం అందిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో రాజధాని లేక రాష్ట్ర ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో , రాష్ట్ర ఏ విధంగా నష్టపోయిందో ప్రధానమంత్రి మోదీకి తెలుసు అన్నారు. అందుకే అమరావతి రాజధాని నిర్మాణం కోసం 15 వేల కోట్ల రూపాయలు గ్రాంటుగా ఇప్పించాడన్నారు. నెట్టెం రఘురామరాజు మాట్లాడుతూ ఒక వైపు దేశంలో ఉగ్రవాదుల దాడి జరిగింది. మరో వైపు పక్క దేశం యుద్దానికి కాలుదువ్వుతున్న పరిస్థితుల్లో ప్రధాన మంత్రి మోదీ రాష్ట్ర భవిష్యత్తను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పదీక్షను దృష్టిలో పెట్టుకుని వస్తురన్నారు. ఎన్నికల సమయంలో చూపిన ఉత్సాహం, మోదీ రాక సమయంలో కూడా ప్రజలందరూ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అబ్జర్వర్ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, సయ్యద్ రఫీ, ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ డూండీ రాకేష్,మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లాహ్, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్ లతోపాటు స్థానిక నాయకులు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చర్జులు పాల్గొన్నారు.

# మే 2న ప్రధాని పర్యటనను జయప్రదం చేయండి



## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

**గన్నవరం, ఏప్రిల్ 28, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గ అధికారులు, కూటమి నాయకులు సమిష్టి గా పనిచేసి వచ్చేనెల 2వ తేదీ దేశప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పిలుపు నిచ్చారు. ప్రధాని పర్యటన ను జయప్రదం చేసెందుకు చేపట్టాల్సిన చర్యల పై అధికారులు, కూటమి నేతలతో సోమవారం సాయంత్రం గన్నవరంలోని తన కార్యాలయం లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులను ప్రారంభించేదుకు వస్తున్న ప్రధాని బహిరంగసభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలని కోరారు. సభకు వచ్చే ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఆహారం, తాగునీరు అందుబాటులో ఉంచుతామన్నారు. సభకు హాజరయ్యే ప్రజలకు బస్సులు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం నుండి సుమారు 20 వేలమంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. సభకు ప్రజలను తీసుకువెళ్లే వాహనాల్లో అందరికీ సరిపడా తాగునీరు, ఆహారం ఉంచాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, డిసి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, ముల్పూరి సాయికళ్యాణి, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ చలమలశెట్టి రమేష్, బీజేపీ రైతుమోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, నాయకులు దయాల రాజేశ్వరరావు, గొడ్డళ్ళ చిన్న రామారావు, బొప్పన హరికృష్ణ, పుట్టా సురేష్, జాస్తి శ్రీధర్, శేషుకుమార్, వేములపల్లి శ్రీనివాసరావు, మేడేపల్లి రమ, బోడపాటి రవికుమార్, ఎండివో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా బండి రామకృష్ణ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన మచిలీపట్నం జనసేన పార్టీ రథసారథి బండి రామకృష్ణకి మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్ జనసేన పార్టీ నాయకులు దేవనూరి వీరబాబు తదితరులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలి

**పామర్రు ఏప్రిల్ 28 మేజర్ న్యూస్ :** రాజధాని పునఃనిర్మాణం పనులు ప్రారంభించేందుకు మే నెల 2వ తేదీన రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేయాల్సిన అవసరం ఉందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రులోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, దేశ, ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరి చూపు అమరావతి వైపు తిరిగే విధంగా ప్రధానమంత్రి సభను విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.



ఇందుకు గాను నియోజకవర్గ పరిధిలోని కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కృషిచేసి జన సమీకరణ చేసి ఈ సభకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల వారీగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం బస్సులలో టిఫిన్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వాటితోపాటు మధ్యాహ్న భోజనం సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నామన్నారు. అనంతరం సాయంత్రం సమావేశం ముగిసిన అనంతరం అమరావతిలో భోజన ఏర్పాట్లు ఉన్నాయని అందరూ భోజనాలు చేశాక తిరిగి బస్సులలో క్షేమంగా ఆయా గ్రామాలకు సురక్షితంగా చేరుస్తామన్నారు. ఈ విషయాన్ని మండల నాయకులు గ్రామ నాయకులు, కార్యకర్తలతో చర్చించి జన సమీకరణ విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రతి మండలంలోనూ ఇద్దరు అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని ఆశ, అంగన్వాడి, డ్వాక్రా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కు సంబంధించిన అధికారులు తో కలిసి స్థానిక నాయకులు కార్యకర్తలు జన సమీకరణను చేపట్టాలన్నారు. పామర్రు నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న కోట వీరబాబు మాట్లాడుతూ రానున్న రెండు రోజులపాటు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కృషిచేసి బస్సులలో ప్రజలను అమరావతికి చేర్చే విధంగా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి అమరావతి రాజధాని ప్రాంతాన్ని చూసేందుకు వెళ్లిన ప్రజలు తిరిగివచ్చి ప్రతి ఒక్కరు గత ఐదు సంవత్సరాల కాలంలో రాజధాని ఏ విధంగా నాశనం అయిందో ఇతరులకు చెప్పే అవకాశం కల్పించిన వారమవుతామన్నారు. ఈ నియోజకవర్గం నుండి పదివేల మంది జన సమీకరణ చేయాల్సి ఉందని, అయినప్పటికీ అంతకంటే ఎక్కువ మందిని తీసుకువెళ్లడం ద్వారా జరిగిన వినాశనాన్ని వారికి చూపించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రధాని మోడీ సభకు జన సమీకరణపై ప్రత్యేకంగా నియమింపబడిన ప్రత్యేక అధికారి మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గం నుండి జన సమీకరణను చేసే ఏర్పాటు చూడాలని ఆదేశించిందన్నారు. ఈ సభకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి మాత్రమే జన సమీకరణ చేస్తున్నామని, వేసవికాలం కావడంతో ఎండ తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుండి జన సమీకరణను చేపట్టడం లేదన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు కృషిచేసి జన సమీకరణ చేయడం ద్వారా ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా జన సమీకరణ చేసే విధానంపై అన్ని మండల పార్టీ అధ్యక్షులతో మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, రాజులపాటి శ్రీనివాసరావు, వీరపనేని శివరాం ప్రసాద్, చలసాని రమేష్ చౌదరి లతో పాటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కేసులను తారుమారు చేసిన ఎస్ఐ బి.రామారావుపై విచారణ జరపండి



**జగ్గయ్యపేట ఏప్రిల్ 28 మేజర్ న్యూస్ :** పట్టణ పోలీస్ స్టేషన్లో గతంలో పనిచేసిన సబ్ ఇన్స్పెక్టర్ బి రామారావు కేసులను తారుమారు చేసి తమకు న్యా యం చేయలేదని పట్టణానికి చెందిన ఎం సైదేశ్వర రావు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్.నెంబర్ 331/2022 కేసును అప్పటి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి. రామారావు చట్ట ప్రకారం విచారణ జరపకుండా తన స్వార్థం కోసం క్రిమినల్ కేసును సివిల్ కేసుగా చిత్రీకరించి ముగించటం పై ప్రత్యేక అధికారి చే విచారణ జరిపించాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌కు ముత్యాల సైదేశ్వర రావు ఫిర్యాదు చేశారు. 2021-2022 ప్రాంతంలో అప్పటి తాసిల్దార్‌కే రామకృష్ణ మరికొందరిపై ఆయన జగ్గయ్యపేట కోర్టులో కేసు వేయగా పోలీసులను విచారణ చేయవలసిందిగా కోర్టు వారు ఆదేశించడం జరిగింది. ఆ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ బి. రామారావు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో నిబంధనలకు విరుద్ధంగా సబ్ ఇన్స్పెక్టర్ బి. రామారావు సివిల్ కేసుగా ముగిస్తున్నట్లు నాకు నోటీసు ద్వారా తెలియజే శారు. అయినప్పటికీ సబ్ ఇన్స్పెక్టర్ రామారావు ని ఫైనల్ రిపోర్టును కోరగా మీరు జగ్గయ్యపేట కోర్టులోనే తీసుకోవాలి మా పోలీస్ ద్వారా ఇవ్వరాదని చెప్పిన మాటల ప్రకారం ఆయన తన లాయర్ ద్వారా జగ్గయ్యపేట కోర్టులో ఫైనల్ రిపోర్టు కొరకు దరఖాస్తు చేయగా కోర్టు వారు ఫైనల్ రిపోర్టు పో సు వారు ఇవ్వలేదని న్యాయవాది అయనకు తెలిపినట్లు తెలిపారు. దీనిపై జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్ కు గడిచిన మూడేళ్ల కాలంలో సబ్ ఇన్స్పెక్టర్లగా వచ్చిన వారిని అనేకసార్లు కలిసి ఫైనల్ రిపోర్టును కోరగా విచారణ అధికారి గా ఉన్న సబ్ ఇన్స్పెక్టర్ రామారావు బదిలీపై వెళ్లారని వారు స్టేషన్కు తన కేసుకు సంబంధించిన ఫైనల్ రిపోర్టు అప్పగించలేదని పేర్కొన్నారు. ఈ వి ధంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి క్రిమినల్ కేసును తన స్వార్థం కోసం సివిల్ కేసుగా పరిగణించిన సబ్ ఇన్స్పెక్టర్ బి. రామారావు విధులను నిర్లక్ష్యం చేసిన వారి పై విచారణ జరిపించి వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని, అదేవిధంగా కేసును తిరిగి విచారణ ప్రారంభించేం దుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## వైసిపి రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా జై గోపాల్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా అవనిగడ్డ మాజీ ఉపసర్పంచ్ గాజుల జై గోపాల్ నియమితుల య్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పంపినట్లు జై గోపాల్ తెలిపారు. రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సమావేశం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించగా ప్రచార కార్యదర్శిగా తనను నియమిస్తూ జగన్మోహన్ రెడ్డి నిర్ణయించినందుకు జగన్మోహన్ రెడ్డితో పాటు నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు, కృష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్చార్జి నరసింహారావు యువ నాయకులు వికాస్ బాబు కి జై గోపాల్ ధన్యవాదాలు తెలిపారు.

# గ్రామీణ ప్రాంతంలో వికసించిన విద్యా కుసుమం



### దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని కాలేజీ థర్డ్, రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు సాధించిన పుజిత

**జగ్గయ్యపేట ఏప్రిల్ 28 మేజర్ న్యూస్ :** పేదరికం చదువుకు అడ్డం కాదని దాతల సహకారం అందిస్తే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని నిరూపించింది మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన కూచిపూడి పుజిత. తన తండ్రి కూచిపూడి సుధాకర్ ఆటో నడుపుతూ తన ఇద్దరు ఆడ పిల్లలను చదివిస్తున్నాడు. తన పెద్ద కుమార్తె సైతం ప్రస్తుతం నాగార్జున యూనివర్సిటీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతుంది. తన చిన్న కుమార్తె పుజిత పదో తరగతి జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో చదివి 578 మార్కులు సాధించింది. అనంతరం పట్టణంలోని జేఆర్సి కళాశాలలో 2024 బి 25 సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదివింది. ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో 1000 మార్కులు గాను 983 మార్కులు సాధించి జగ్గయ్యపేట పట్టణ 3వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో యాజమాన్యం ఈనెల 15వ తేదీ ఏర్పాటు చేసిన విజయోత్సవ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ చేతుల మీదగా పూజిత, తల్లిదండ్రులు సుధాకర్, నర్సు బాయిలను శాలువా, పూల బుకాయ్ లతో ఘనంగా సత్కరించారు. ఇంతటి విజయాన్ని అందుకున్న పుజిత భవిష్యత్తులో ఇంజనీర్ కావాలని ఆశిస్తుంది.

### దాత సహకారంతో పుజిత ఇంతటి విజయం సాధించింది

కూచిపూడి పుజితను తన తండ్రి సుధాకర్ స్నేహితుడైన జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఆర్వేపల్లి శ్రీనివాసరావు ప్రస్తుతం చిత్తూరులో ఉంటూ పూజిత ఇంటర్మీడియట్ కు అయ్యే ఖర్చు అంతా పెట్టి చదివించాడు. తన తండ్రి యొక్క ప్రోత్సాహం, దాత యొక్క ఆర్థిక చేయూతను అందిపుచ్చుకొని కష్టపడి చదివి ఇంటర్మీడియట్ లో మంచి ర్యాంకు సాధించింది. దీనిని బట్టి చూస్తే కష్టపడి ఇష్టంతో చదివితే ఎంతటి విజయాన్ని సాధించవచ్చని నిరూపిస్తూ మిగిలిన విద్యార్థులకు తను ఆదర్శవంతంగా నిలిచింది పుజిత. ఈ సందర్భంగా తన కుమార్తె చదువుకు ఆర్థిక చేయూతనిచ్చిన శ్రీనివాసరావుకు తన కుటుంబం అంతా రుణపడి ఉంటామని, అలాగే జేఆర్సి యాజమాన్యం, కళాశాల అధ్యాపక బృందానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# పులిగడ్డలో పశువుల నీటి తొట్టె ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తీర గ్రామాల్లో వేసవిలో మూగ జీవాల దాహం తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పులిగడ్డలో పల్లె పండుగ 2025-26 కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.38,450లతో నూతనంగా నిర్మించిన పశువుల నీటి తొట్టె ను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. గోమాతలకు పూజ చేసి వాటికి నీరు తాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో విస్తృతంగా సీసీ రోడ్లు, పాఠశాలలకు ప్రహరీలు నిర్మించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రగతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గ్రామీణ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సహకారంతో నియోజకవర్గంలో రూ.5,38,300లతో పద్నాలుగు నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో పశు పోషకులు తమ మూగ జీవాలను కాపాడుకునేం దుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సాంబశివరావు, సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మండలి శివప్రసాద్, నాయకులు మండలి శేషు, ఏపీఎం రవికుమార్, పంచాయతీ కార్యదర్శి అనిత, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని శ్రీకారం చుడుతున్నారు

### అమరావతి సభ విజయవంతం చేయాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మహోన్నత రాజధాని అమరావతి నిర్మాణం పునఃప్రారంభానికి భారత ప్రధాని నరేంద్రమోడీ శ్రీకారం చుడుతున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రధాని మోడీ అమరావతి పర్యటన, సభ విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజనతో రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి రైతులను ఒప్పించి ముప్పై వేల ఎకరాలు భూమిని సమీకరించి, రాష్ట్ర పరిపాలన అమరావతి నుంచే జరిగేలా తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ కోర్టు నిర్మించటంతో పాటు ప్రధాని మోడీ సహకారంతో శాశ్వత రాజధాని నిర్మాణం కూడా చేపట్టారని తెలిపారు. కానీ జగన్మోహనరెడ్డి తాను కూడా అమరావతికి అనుకూలమని సంకేతాలతో ఎన్నికల్లో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో అమరావతికి తీరని ద్రోహం చేశారన్నారు. ఫలితంగా రాజధాని ఏదో తెలియని దుస్థితి ఎదుర్కొన్న రాష్ట్ర ప్రజలు జగన్ దుష్ట పరిపాలనపై కసితో సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా అమరావతి రాజధాని నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మే రెండో తేదీ భారత ప్రధాని నరేంద్రమోడీ అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభోత్సవ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని మోడీ పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిరువోలు బుచ్చిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, చెన్నగిరి సత్యనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, జనసేన పార్టీ అవనిగడ్డ, కోడూరు, మోపిదేవి మండలాల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, మర్రె గంగయ్య, పూషడపు రత్నగోపాల్, బీజేపీ మండల అధ్యక్షులు సనకా ప్రశాంత్, గుడివాక శివాజీ, శోభిల ఏడుకొండలు, బచ్చు విజయలక్ష్మి, జనసేన టౌన్ అధ్యక్షులు రాజనాల వీరబాబు, బొందలపాటి వీరబాబు, నాగాయలంక మండల నాయకులు బండ్రెడ్డి హరి, నియోజకవర్గ ఐటీ కో-ఆర్డినేటర్ సూదాని నందగోపాల్, పిట్టల్లంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, టీసీ అధ్యక్షులు బడే భావన్నారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, నాయకులు అడపా రాంబాబు, యర్రంశెట్టి దామోదర్, బాదర్ల లోలాక్షు నాయుడు, కాగిత రామారావు, గోళ్ళ శ్రీనివాసరావు, కోసూరు శివాజీ, మండలి శివప్రసాద్, అరజా కిరణ్ కాంత్, అరజా రాధిక, తోట మురళీకృష్ణ, సుగ్గన పవన్ కుమార్, మెరకనపల్లి నరేష్, బచ్చు వెంకటేష్, షేక్ నసీంఘోరీ, కొల్లి వెంకటేశ్వరరావు (చినబాబు), యడ్లపల్లి బుజ్జి, రెడ్రౌతు కృష్ణబాబు, జీవీ తాతారావు, కోసూరు రామాంజనేయులు, కొండవీటి శ్రీనివాసరావు, తుంగల నరేష్, కమ్మిలి సాయి భార్గవ, కోసూరు అవినాష్, మత్తి సుబ్రహ్మణ్యం, మత్తి వంశీ, పూతబోయిన కరుణ కుమార్, యడ్ల శ్రీనివాసరావు, జరుగు పోతురాజు, కోసూరు నాగమల్లేశ్వరరావు, నల్లమోతు వీరయ్య, కృష్ణాంజనేయులు, గంగిశెట్టి బాబూ రాజేంద్ర, మడమల రంజిత్, హరిబాబు, బీజేపీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# నాగర్ కోయిల్ పారిశుధ్య నిర్వహణను అధ్యాయనం చేసిన వీఎంసీ కార్పొరేటర్ల బృందం





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** 6 యంఆర్ఎఫ్ ప్లాంట్ లతో నాగర్ కోయిల్ సిటీ కార్పొరేషన్ వారి పారిశుధ్య నిర్వహణ చేస్తున్నారని మేయర్ మహేష్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా సోమవారం నాగర్ కోయిల్ కార్పొరేషన్‌ను సందర్శించగా పలువురు కౌన్సిలర్స్, అధికారులతో కలసి విజయవాడ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ రెడ్డి, కార్పొరేటర్ల బృందానికి కమిషనర్ నిశాంత్ కృష్ణ తో స్వాగతం పలికారు. ఈ సందర్భంలో టూర్ కోఆర్డినేటర్, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లను పరిచయం చేశారు. విజయవాడ నగర భౌగోలిక పరిస్థితి, పారిశుధ్య నిర్వహణ, మొదలుగు అంశాలను ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ వివరించారు. నాగర్ కోయిల్ మేయర్ మహేష్ మాట్లాడుతూ స్టడీ టూర్ లో భాగంగా విజయవాడ కార్పొరేటర్ ఇక్కడకు రావటం సంతోషంకరముగా ఉందని, 54 డివిజన్లు కలిగిన ఈ కార్పొరేషన్‌ను 4 జోన్ లుగా విభజించి పరిపాలన కొనసాగుతున్నది కౌన్సిల్ నిర్వహణ విధానం అధికారుల పని విధానం మొదలుగు అంశాలను విజయవాడ కార్పొరేటర్‌లతో పంచుకొన్నారు. 6 యంఆర్ఎఫ్ ప్లాంట్ లతో పారిశుధ్య నిర్వహణలో వ్యర్ధాలను వేరు చేస్తున్నారని, పారిశుధ్యం నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏజెన్సీలతో వ్యర్ధాలను సేకరిస్తున్నారని. కీ – పర్ఫామెన్స్ ఇండెక్స్ ద్వారా వారి పనితీరుని చూస్తారని అన్నారు. వ్యర్ధాల సేకరణలో వ్యర్ధాలను తూగే కాట ద్వారా ఆ వ్యర్ధాలు ఏ ప్రాంతం నుండి వచ్చిందో జిపిఎస్ ద్వారా వారు ట్రాక్ చేయగలరని, తద్వారా ఇంటి నుండి చెత్త సేకరణ 100% జరుగుతుందని తెలిపారు. వేసవికాలంలో ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రభుత్వం డ్యాం నుంచి ప్రత్యేకంగా త్రాగునీటి కోసం నీరు విడుదల చేస్తుందని తద్వారా త్రాగునీటి సరఫరాలో నగర ప్రజలకు ఎటువంటి లోపం లేకుండా చూసుకుంటారని తెలిపారు. అంతేకాకుండా వేసవి దృశ్య ప్రజలకు హీట్ ప్రివెన్షన్ కిట్ లో భాగంగా ఒఆర్ఎస్, టోపీ, కూలింగ్ గ్లాసులు, వంటి వేసవికాలంలో ప్రజల ఆరోగ్యంలో కోసం ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.

ఈ సందర్భంగా నాగర్ కోయల్ కార్పొరేషన్ కమిషనర్ నిశాంత్ కృష్ణ మాట్లాడుతూ నగరంలో కోణం ప్రాంతములో ఒక నాలెడ్జ్ సెంటర్ ను కార్పొరేషన్ వారు ఉచిత లైబ్రరీ సౌకర్యాన్ని కల్పించారని, 5300 చదనపు అడుగుల విస్తీర్ణంలో, రెండంతస్తుల భవనాన్ని నిర్మించారాని, నగర ప్రజలకు ఉచితంగా చదువుకునే సౌకర్యం కలుగుతుందని, కంప్యూటర్ వైఫై వసతులతో పోటీ పరీక్షలకు చదువుకునే వారికి ఎంతగానో ఉపయోగపడే విధంగా ఈ నాలెడ్జ్ సెంటర్ అందుబాటులో ఉంటుందని అన్నారు. తదుపరి కార్పొరేటర్ల బృందం క్షేత్ర స్థాయిలో కోణంలో గల నాలెడ్జ్ సెంటర్ పరిశీలన చేసిన సందర్భంలో భవన నిర్మాణం, గదులు వెస్తీర్ణం తదితర అంశాలని కమిషనర్ నిశాంత్ కృష్ణ స్వయంగా కార్పొరేటర్లకు ఫీల్డ్ లో తెలియపరిచారు. టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు వారు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ విజయవాడ నగరపాలక సంస్థ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు వారికి ఆహ్వానం పలికారు.

# గంజాయి స్మగ్లర్ భార్య నిడుగుంట అరుణ నేరస్తులపై చర్యలు తీసుకోవాలి

## హైకోర్టు అడ్వకేట్ పెట్టేటి రాజారావు

**విజయవాడ మేజర్ న్యూస్ :** యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, పడుగుపాడు గ్రామం, సాయి ఎన్ క్లేవ్ అపార్ట్మెంట్ లో నిడగుంట అరుణ తన అనుచరులైన ఐ.మునింద్ర, రేఖ, నిడుగుంట నరసింహులు, నిడుగుంట అరుణ అమ్మ, సత్యవేటి శివకోటయ్య, సత్యవేటి మునిస్వామి చింతపు రెడ్డి చంద్ర చౌటూరు వెంకటరమణయ్య గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైకోర్టు అడ్వకేట్ పెట్టేటి రాజారావు కోరారు. సోమవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిడగుంట అరుణ తన అనుచరులచేత కోవూరు మండలం లోని లేగుంటపాడు, ఇనమడుగు, చేర్లపాలెం ఇతర కాలనీ లలో, బోడిగుడ తోట చుట్టూ ఉన్న ప్రాంతాలలో విచ్చలవిడిగా చట్టవిరుద్ధంగా గంజాయి విక్రయిస్తున్నారన్నారు. ఆ రౌడీషీటర్లు, గుండాల అండతో గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్న నిడుగుంట అరుణ ఈమె అనుచరులపై యస్.పి.యస్. అర్ నెల్లూరు జిల్లా యస్.పి దొరకఠిన చర్యలు తీసుకొని చట్టపరంగా ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నామని హైకోర్టు అడ్వకేట్ పెట్టేటి రాజారావు అన్నారు. నిడుగుంట అరుణ చేస్తున్న ఈ గంజాయి స్మగ్లింగ్ వ్యాపారానికి సాయి ఎన్ క్లేవ్ అపార్ట్మెంట్ లొనికి ప్రతిరోజు రాత్రిం పగళ్ళు నెంబర్ ప్లేట్ లేని కార్లు, నెంబర్ ప్లేట్ లేని రకరకాల గుర్తు తెలియని వాహనాలు, గుర్తు తెలియని వ్యక్తులు, రౌడీలు, గుండాలు, రౌడీ షీటర్లు వీరిని నిడుగుంట అరుణ పోషిస్తు వారి చేత దొంగతనాలు, దారి దోపిడిలు, దోమ్మిలు, ఈ మధ్య జరిగిన హత్యలు వీరిచేత చేయిస్తు అక్రమంగా డబ్బును సంపాదిస్తూ అక్రమాలకు పాల్పడుందన్నారు. ఈమె చేస్తున్న నేరాలు– గోరాలు సాయి ఎన్ క్లేవ్ అపార్ట్మెంట్ సీ.సీ కెమెరాలు పరిశీలిస్తే, ఈమె ఫోన్ రికార్డును పరిశీలిస్తే ఈ నేరస్తురాలు చేస్తున్న నేరాలు గోరాలు వెలుగులోనికి వస్తాయని, ఆమె రౌడీలు, గుండాలు చేత పోలీసు మారు వేషాలు వేయించి దొమ్మిలు చేయిస్తుందని, ఈమెను చట్టపరంగా జైలు లో ఉంచి ప్రజలకు న్యాయం చేయాలని చట్టపరంగా న్యాయం చేయాలని పెట్టేటి రాజారావు కోరుతున్నామన్నారు. ఈసమావేశంలో శ్రీనివాస్, మోహన్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలను నిరోధించేందుకు బ్యాంకర్లతో సమావేశాలు





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** సమాజంలో వివిధ రకాల సైబర్ నేరాలు జరుగుతున్నాయి, నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా, సైబర్ ద్వారా జరిగే నేరాల గురించి అవగాహన కల్పించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు కమీషనరేట్ పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో పోలీస్ కమీషనర్ కో–ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్ మొదలగు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో సోమవారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు రూరల్ నందిగామ, తిరువూరు పరిదిలోని ఆయా పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ల పరిదిలోని బ్యాంకులలో బ్యాంకు అధికారులతో, అక్కడకు వచ్చిన ప్రజలతో సమావేశం నిర్వహించి సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్ మొదలగు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు "డిజిటల్ అరెస్ట్" పేరుతో అధికారులుగా నటిస్తూ నకిలీ ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా కస్టమర్లను భయభ్రాంతులకు గురి చేసి వారు మాదకద్రవ్యాలు, మనీలాండరింగ్ కేసుల్లో వారి ప్రేమేయం ఉన్నట్లు నమ్మించి అమాయకులను మోసం చేస్తున్నారు. అపరాధ రుసుము చెల్లించమని బెదిరించి డబ్బులు ట్రాన్స్ఫర్ చేయిస్తున్నారని, మోసపోతున్న అమాయకులు బ్యాంకు కు వచ్చి వారి సేవింగ్స్ అకౌంట్ నుండి ఇతర రాష్ట్రల కరెంటు అకౌంట్ కు ట్రాన్స్ఫర్ చేయాలనీ బాంకు అధికారులను అడిగినప్పుడు అటువంటి సందర్భాలలో బ్యాంకు వారు పోలీస్ వారు ఇచ్చిన ప్రశ్నవలి వారికి వివరించి తదుపరి పూర్తి వివరాలను సేకరించి పోలీస్ వారికి తెలియజేసినప్పుడు ఇటువంటి నేరాలను నిరోధించడానికి అవకాశం ఉంటుంది. కావున ఈ విషయం లో బ్యాంకర్స్ సహకారం అవసరం అని తెలియజేసారు. ఈ క్రమంలో ప్రజలు ఇటువంటి నేరాలపై అవగాహన కలిగి ఉండి సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని అవగాహన కల్పించారు.



# విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎన్నుకున్నా ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో నియోజకవర్గంలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 26 మంది మెరిట్ విద్యార్థులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇదే దీక్షతో ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసంతో తమ బిడ్డలను చేర్చిన తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ప్రిన్సిపాల్స్ వీరరవి, కుమార్, నరసింహారావు, ఎంఈఓలు ఎన్.శివ శంకర్, అన్నపరెడ్డి పిచ్చియ్య, టీవీఎం రాందాస్, విశ్వనాథపల్లి శ్రీనివాస రావు, జీ.ఎన్.బీ గోపాల్, మోమీన్, రామారావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# విస్తృతంగా యాంటీ నార్కోటిక్, ఈగల్ టీం బృందాలు తనిఖీలు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు డి.సి.పి. కె.జి.వి.సరిత సూచనల మేరకు ఎ.సి.పి.లు ఎస్.కిరణ్ కుమార్, కె.లతాకుమారి పర్యవేక్షణలో, పోలీస్ కమీషనరేట్ పరిదిలో యాంటీ నార్కోటిక్, ఈగల్ టీం లను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృంధాల వారు నగరంలోని వివిధ ప్రదేశాలలో విస్తృతంగా తనిఖీ నిర్వహించి చట్ట వ్యతిరేకంగా మద్యం, గంజాయి, ఇతర వస్తువులను రవాణా నియంత్రించడం, అనుమానిత ప్రదేశములపై నిఘా పటిష్టం చేయడంతోపాటు విరివిగా ఆయా ప్రదేశాలను తనిఖీ చేయడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించేవారిని అదుపులోకి తీసుకోవడంతో వారికి మత్తు పధార్ధాలను సేవించడం వలన కలిగే అనార్ధాల గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా లేడీస్ హాస్టల్స్ సమీపంలలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా అనుమానితులను తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం యాంటీ నార్కోటిక్, ఈగల్ టీం బృంధాల వారు నగరంలోని వివిధ ప్రదేశాలలో తనిఖీలను నిర్వహించి 34 మంది అనుమానిత వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఓపెన్ ప్రదేశాలలో మద్యం సేవించిన 64 మందిని అదుపులోనికి తీసుకుని తగు చర్య నిమిత్తం వారిని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి అప్పగించారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా 14 అనుమానితులను తనిఖీ చేయగా పాత కేసులలో నిందితుడైన ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని స్టేషన్ లో అప్పగించారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపిన 65 మంది వ్యక్తులకు జరిమానా



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. వారి అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమవారం 2వ,4వ, 5వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 65 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను సంబంధిత కోర్ట్ లలో ప్రవేశపెట్టగా, గౌరవ న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 65 మందిలో 12 మందికి ఒక్కొక్కరికి రూ.15,000ల చొప్పున మిగిలిన 53 మందికి ఒక్కొక్కరికి రూ.10,000/– చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. తెలియజేయటం జరిగింది.

# రెండు కోట్ల రూపాయల నిధులతో పాయకాపురం చెరువు అభివృద్ధి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రెండు కోట్ల రూపాయల నిధులతో పాయకాపురం చెరువు పనులు అభివృద్ధి చేస్తున్నామని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా పాయకాపురం చెరువు, అజిత్ సింగ్ నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం, కండ్రిక ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెండు కోట్ల రూపాయల అమృత్ నిధులతో, పాయకాపురం చెరువుల అభివృద్ధి చేస్తున్నామని, ఆహ్లాదకరమైన వాతావరణన్ని కల్పించడమే కాకుండా కాలుష్యం తగ్గించే విధంగా మొక్కలు ఉండాలని అధికారులను ఆదేశించారు. తదుపరి అజిత్ సింగ్‌నగర్‌లో గల మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాకింగ్ ట్రాక్, జిమ్ ఎక్విప్మెంట్, మొరుగుదొడ్ల అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి కండ్రికలో అమృత ఇన్సెంటివ్ నిధులలో భాగంగా జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జాయింట్ డైరెక్టర్ అమృత డాక్టర్ లత, సూపరింటెంట్ ఇంజనీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్ప్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు బకాయిలను వెంటనే చెల్లించాలి





**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ ఏపి రాష్ట్ర శాఖ ప్రతినిధులు పలువురు ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మొగల్రాజపురంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.తులసి ప్రసాద్, ఉపాధ్యక్షుడు పరుచూరి శ్రీనివాసరావు, ఇండిపెండెంట్ స్కూల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీకాంత్ బాబు, ప్రధాన కార్యదర్శి భరత్, ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సుందర్ రామ్‌లు మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదని, విద్యార్థుల చదువులకు ఆటకం కలగకూడదనే ఉద్దేశంతో ఫీజులు చెల్లించకపోయినా వారిని కొనసాగిస్తున్నామన్నారు. గత మూడేళ్ళుగా ఇచ్చిన అడ్మిషన్లకు ఫర్ చైల్డ్ ఎక్స్పెండిచర్‌ను కమిటీ నిర్ధారించి పాత బకాయిలను చెల్లించి నూతన అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. రైట్ టు ఎడ్యుకేషన్ కింద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇస్తున్నామని, అవి ఉచితమైన సీట్లు కావని దాని తాలూకు ఫీజులను ప్రభుత్వం తమకు రీ ఎంబర్స్‌మెంట్ చేయాలన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదన్నారు. 2025 -26 ప్రవేశాలకు సంబంధించిన జీఓను విడుదల చేసారని, అది విడుదల చేసే ముందు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ఒక స్థానంలో లేకుండా, రాబోయే సంవత్సరానికి ఉండాల్సిన ఫీజులు నిర్ధారించకుండా ప్రవేశాల గురించి ప్రకటన చేశారన్నారు.

ఆర్టీఈ 12 (1) సి అడ్మిషన్లకు తాము వ్యతిరేకం కాదని, గత సంవత్సరం 38 వేలు అడ్మిషన్లు చేశామన్నారు. ఎప్పుడు పిల్లలను బయట పంపలేదు, ఇబ్బంది పెట్టకుండా చదువు చెబుతున్నామని తెలిపారు. ఆర్టీఈ యాక్ట్ అడ్మిషన్ల ప్రక్రియపై తాము కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేస్తున్నామన్నారు.

# ప్రధాని పర్యటనకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా కట్టుదిట్టంగా చేయాలి

## రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ జి ఏ డి ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా



**గన్నవరం, ఏప్రిల్ 28, మేజర్ న్యూస్ :** వచ్చే మే నెల రెండో తేదీన ప్రధానమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ జి ఏ డి ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ప్రధాన కార్యదర్శి, శాంతిభద్రతల ఎడిజి మధుసూదన్ రెడ్డి ఐజి అశోక్ కుమార్ అయి త్రివిక్రమ్ వర్మ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ సహాయ కలెక్టర్ శిక్షణలో ఉన్న సహాయ కలెక్టర్ ఫరీన్ జైద్ లతో కలిసి గన్నవరం విమానాశ్రయంలో విఐపి విరామశాల, కంటైనర్, హెలికాప్టర్లు దిగే ప్రదేశాలు పరిశీలించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తదనంతరం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విమానాశ్రయ అధికారులు జిల్లా అధికారులతో ఏర్పాట్లపై అక్కడే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఎస్ పి జి వారు భద్రత ఏర్పాట్లపై ఏఎస్ఎల్, సమావేశం నిర్వహిస్తారన్నారు. ఆలోగా విమానాశ్రయ భవనంలో అగ్నిమాపక యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరీక్షించాలన్నారు. ప్రధానమంత్రి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటైనర్ను విరామశాలను తనిఖీ చేయాలన్నారు. ప్రధానమంత్రి పర్యటించే సమయంలో విద్యుత్తుకు ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ రూమ్ కు ఇన్చార్జిగా ఉన్నవారు అన్ని ఏర్పాట్లు బాగా పరిశీలించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు వారికి అప్పగించిన పనులను సజావుగా పూర్తి చేయాలన్నారు. విమానాశ్రయంలో దెబ్బతిన్న టైల్స్ ను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. హై స్పీడ్ అంతర్జాలం, అంబులెన్స్ లు అందుబాటులో సిద్ధంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో విమానాశ్రయం డైరెక్టర్ ఎం ఎల్ కె రెడ్డి, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు బాలసుబ్రమణ్యం, హేలా షారోన్, ఎస్సీ సంక్షేమ,సాధికారత అధికార షాహిద్ బాబు, అగ్నిమాపక అధికారి ఏసురత్నం, ఆర్టీఓ శ్రీనివాసరావు, ప్రోటోకాల్ అధికారి మోహన్ రావు, డ్వామా పీడీ శివప్రసాద్, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, డిపిఓ అరుణ, డి ఐ ఓ ఫణికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధర్, ఏపీఎంఐపీ పిడి విజయలక్ష్మి, పలువురు తహసీల్దారులు పాల్గొన్నారు.







## బోడపాడులో శ్రీ గంగానమ్మ తిరునాళ్ల మహోత్సవాలు ప్రారంభం

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం నున్న పంచాయతీ పరిధి బోడపాడులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ నేతృత్వంలో నిర్మించిన సమరసత శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానం తిరునాళ్ల మహోత్సవాలు సోమవారంర ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ మహాలక్ష్మి, మహా సరస్వతి, మహాకాళి స్వరూపిణి అయిన శ్రీ గంగానమ్మ అమ్మవారు బోడపాడులో స్వయంభుగా వెలిశారు. దీంతో ఏటా మూడు రోజులపాటు తిరునాళ్ల మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే తొలి రోజైన సోమవారం ఉదయం అమ్మవారి సుప్ర భాతం, ఆలయశుద్ధి, నిత్యార్చన, గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపారాధన, కలశస్థాపన, అంకురార్పణ పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలతో మాను పూజ, పసుపు కుంకుమ సమర్పణ అనంతరం శ్రీ గంగానమ్మ అమ్మవారు ఆలయ ప్రవేశం చేశారు. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా తొలి రోజున ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల్ స్వామి నేతృత్వంలో అష్టోత్తర శత కలశాభిషేకం (108 కలశాలతో) పంచామృత అభిషేకం, అలంకరణ తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాలార్చన, సహస్రనామార్చన, చతుర్వే దపారాయణ, పంచహారతులు, తీర్థప్రసాద వినయోగం, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గంగానమ్మ అమ్మవారి తిరునాళ్లకు నున్న, బోడపాడుతోపాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా నెట్టెం రఘురామ్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌ను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో పలు జిల్లాల కేంద్ర సహకార బ్యాంక్‌లకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షునిగా ఉన్న రఘురామ్‌ను జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా నియమించారు. మూడు సార్లు జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు.

## రామాలయంలో ఆశీర్వాదం తీసుకున్న మంత్రులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందరు కోట రామాలయం వద్ద మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మంత్రి కొల్లు రవీంద్ర ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్ లను,గజమాలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం అర్చకులు పూర్ణ కుంభంతో ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేదపండితులు ఆశీర్వాదం అందించారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999